సర్కారు బడి.. సౌకర్యాల ఒడి

ఇప్పటి వరకు సమస్యలతో కొట్టుమిట్టాడిన సర్కారు బడులను చూశాం. కానీ.. ఇప్పుడు ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యతో పాటు.. సకల సౌకర్యాలతో మనఊరు–మనబడి పథకంతో అత్యాధునికంగా రూపుదిద్దుకున్న బడిని చూస్తున్నాం. అదే జిల్లెలగూడ పాఠశాల. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అందరినీ ఆకట్టుకుంటోంది.

డిజిటల్ తరగతి గదులు

- అధునాతన వసతులు
- కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు
- మనఊరు–మనబడితో రూపురేఖలు మారిన జిల్లెలగూడ పాఠశాల

మీర్‌పేట: కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మనఊరు–మనబడి పథకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాలోనే విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ఉన్నత పాఠశాలను సకల హంగులతో తీర్చిదిద్దింది. రూ.2 కోట్ల నిధులతో ప్రైవేటుకు దీటుగా.. డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్లు, అధునాతన బెంచీలు, వాల్ పెయింటింగ్స్, కిచెన్‌షెడ్స్, సోలార్ సిస్టం, పాఠశాల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించింది.

సకల వసతులు

ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు, డెస్క్‌తో కూడిన అధునాతన బెంచీలు ఏర్పాటు చేశారు. 30 తరగతి గదుల్లో సరిపడా కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయి. పాఠశాల చుట్టూ 45 వరకు సీసీ కెమెరాలు అమర్చారు. దీంతో పాటు గతంలో రెడ్కో సంస్థ సహకారంతో.. ఐదు కేజీల సామర్థ్యం కలిగిన సోలార్ సిస్టం (సౌర విద్యుత్)ను జిల్లాలోనే మొదటగా ఈ పాఠశాలలోనే ఏర్పాటు చేయడం విశేషం.



జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల



(ఇన్‌సెట్లో) డిజిటల్ టీవీ బోర్డు

విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయి. ప్రైవేటు స్కూళ్ల మాయాజాలంలో పడి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. బాలాపూర్ మండలంలో ప్రస్తుతం 8,761 బాలబాలికలు ఉండగా.. ఈ విద్యాసంవత్సరంలో 10వేలకు పెంచేందుకు కృషి చేస్తున్నాం. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– కృష్ణయ్య, మండల విద్యాధికారి, బాలాపూర్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ ప్రతాప్



మాట్లాడుతున్న ప్రతాప్

మహేశ్వరం: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ బోసుపల్లి ప్రతాప్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగారంలో కుండె వెంకటేశ్ ఫాంహౌస్‌లో మండల అధ్యక్షుడు టి.యాదిశ్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక ఎన్నికలకు ప్రతి బీజేపీ నాయకులు సిద్ధం కావాలని సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందనడానికి ఇటీవల జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల ఓట్ల శాతమే నిదర్శనమన్నారు. కేంద్రంలో మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో పోటీ చేసే ఆశావాహులు రిజర్వేషన్ల వారీగా ఎంపిక చేసుకొని సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్యయాదవ్, జిల్లా నాయకులు అనంతయ్యగౌడ్, కుండె వెంకటేశ్, సుదర్శన్, యాదయ్యగౌడ్, మాధవచారి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ శాంతిశ్రీ, తల్లులు

కందుకూరు: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులను ఆహ్వానించి అక్షరాభ్యాసం చేయించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు నాటారు. అంగన్‌వాడీ కేంద్రాలతో చేకూరే ప్రయోజనాలు, ప్రైవేట్‌కు దీటుగా ఏవిధంగా ఇక్కడ చిన్నారులను తీర్చిదిద్దుతామో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు ఉచిత ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సబిత, ఎంఈఓ నర్సింహ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

వనస్థలిపురం: డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రశాంత్‌నగర్ కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ ఔట్‌లెట్ సరిగా లేక చిన్నపాటి వర్షాలకే నీరు నిలుస్తోందని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయన స్పందిస్తూ రోడ్డు వెనుక ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలం ఉందని వారితో మాట్లాడి నూతన డ్రైన్ నిర్మాణం చేపడతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్, కాలనీ వాసులు బాలాజీనాథ్, కరుణాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, పద్మారెడ్డి, నాయకులు మిట్టా రాంమోహన్ పాల్గొన్నారు.

ఆ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీరామ్

మహేశ్వరం: శ్లోక పేరుతో విద్యను వ్యాపారం చేస్తున్న స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందాడి శ్రీరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఆ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుక్కుగూడలో నెలకొల్పిన శ్లోక స్కూల్ విద్యను వ్యాపారం చేసి తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు చేస్తుందన్నారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పేరుతో విద్యార్థులను మోసం చేస్తుందన్నారు. బ్రాండ్ పేరుతో లక్షల ఫీజులు పెట్టి, హోర్డింగ్, ప్రకటనల పేరుతో మోసం చేస్తున్న ఆ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అంతకుముందు ఎంఈఓ కార్యాలయంలో ఉన్న అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చిర్ర వంశీ, భానుప్రసాద్, కిషోర్ పలువురు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

జర్నలిస్టులపై దాడి అమానుషం

- ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్న ఏపీ ప్రభుత్వం
- దాడులను ఖండించిన టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

తుర్కయంజాల్: 'సాక్షి' కార్యాలయాలు, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు అమానుషమని, దాడులను ఖండిస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా ఇన్‌చార్జి జగదీష్ అన్నారు. దాడులను వ్యతిరేకిస్తూ.. శుక్రవారం తుర్కయంజాల్ అంబేడ్కర్ కూడలిలో టీడబ్ల్యూజేఎఫ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సిలివేరు యాదగిరి, పల్లాటి జగన్‌ల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం కక్షపూరితంగానే జర్నలిస్టులపై వరుస దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. ఇది సరైంది కాదని, సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాస్‌పై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకుడు డి.కిషన్, బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర కోశాధికారి రమేష్‌లు మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడులను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీను, జర్నలిస్టులు మణి, శ్రీను, నగేష్, ఉపేందర్, వెంకటేశ్, సత్యం, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తంచేస్తున్న జర్నలిస్టులు, నాయకులు

డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

వనస్థలిపురం: డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికతో ముందుకెళుతున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో రూ. 56.50 లక్షలతో నిర్మించనున్న హస్తినాపురం ఈస్ట్ ఫేజ్–1, క్రిస్టియన్ కాలనీ రోడ్డు నెం.2 కనెక్టివిటి సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ సహకారంతో నిధులు తీసుకువచ్చి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ విష్ణుశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, క్రిస్టియన్ కాలనీ అధ్యక్షుడు హరిందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, హస్తినాపురం ఈస్ట్ ఫేజ్–1 అధ్యక్షుడు భూపతిరెడ్డి, రామచంద్రారెడ్డి, శేఖర్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

క్లుప్తంగా

పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగారెడ్డికి సన్మానం



జంగారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఏనుగు జంగారెడ్డిని శుక్రవారం మండల పరిధిలోని నేదునూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు నర్సింహ, రాకేశ్‌గౌడ్ ఆయనను కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నందిహిల్స్ ఫీడర్ పరిధిలోని టీచర్స్‌కాలనీ, నాగార్జునహిల్స్, వెంకటేశ్వరహిల్స్, చైతన్య హిల్స్, నందిహిల్స్ రోడ్ నం 1 నుంచి 12 వరకు, ప్రశాంతిహిల్స్‌లలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. 11కేవీ వాంబేకాలనీ ఫీడర్ పరిధిలోని భూపేశ్ గుప్తానగర్, గాయత్రీనగర్, శ్రీధర్‌కాలనీ, వివేక్‌నగర్, వెంకటేశ్వరకాలనీ, హనుమాన్‌నగర్‌లలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు.

లెనిన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

11కేవీ సీఎంఆర్ ఫీడర్ పరిధిలోని రామిడిహిల్స్, బీఆర్ఆర్‌కాలనీ, విశాఖనగర్, సీఎంఆర్‌కాలనీ, సీవైఆర్‌కాలనీ, ఎస్ఎస్‌రెడ్డికాలనీ, వైఎస్ఆర్‌నగర్, రాజీవ్ గృహకల్ప, శ్రీమారుతీనగర్, వసంతవిహార్, సప్తగిరికాలనీ, చంద్రవిహార్‌కాలనీ, మారుతీనగర్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ శివసాయినగర్ ఫీడర్ పరిధిలోని లక్ష్మీనగర్, ఇందిరమ్మ ఇండ్లు, ఎంఆర్ఆర్‌కాలనీ, వినాయకనగర్, యాదాద్రికాలనీ, రోమా ఫేజ్–1, బీరప్పకాలనీ, వైష్ణవికాలనీ, శివసాయినగర్, పెద్దబావి మల్లారెడ్డిగార్డెన్స్, మాతృశ్రీ ఎన్‌క్లేవ్‌లలో సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ ఎన్.రవికుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: పలు మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ ఫర్హత్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హుడాసాయినగర్, శివపురికాలనీ, హయత్‌నగర్, విజయానగర్‌కాలనీ, అల్కాపురి, విద్యుత్‌నగర్, కొహెడ, శారదానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ భగత్‌సింగ్‌నగర్, రాక్‌హిల్స్, భవ్య హాస్పిటల్, లక్ష్మారెడ్డిపాలెం, హరిపురికాలనీ, సామనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

పాటల పలకీలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కందుకూరు: ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 15న కరీంనగర్‌లోని కళాభారతిలో ఉద్యమ గాయకులు నేర్నాల కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 12 గంటల పాటల పల్లకీలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యమ కళాకారుడు మస్కు మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రం ఏర్పడ్డాక నిజమైన కళాకారులకు అన్యాయం జరిగిందన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ ప్రాంతం నుంచి కూడా పెద్దసంఖ్యలో ఉద్యమ కళాకారులు, మేధావులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేత



యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సురేఖ

మీర్‌పేట: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని 39వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాదరి సురేఖరమేశ్ అన్నారు. శుక్రవారం కమలానగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆమె ఉపాధ్యాయులతో కలిసి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి నివారణకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ పి.సరస్వతి అన్నారు. శుక్రవారం వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని మల్లాపూర్‌లోని పలు కాలనీ వాసులకు పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలతో డెంగీ, మలేరియా, తదితర వ్యాధులు వస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జ్వరం, కీళ్ల నొప్పులు, దగ్గు, తలనొప్పి ఇతర లక్షణాలు ఏర్పడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. దోమలను నిర్మూలించేందుకు ఫాగింగ్, నీరు నిల్వ ఉన్న చోట దోమల నివారణ మందు వేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కార్పొరేషన్‌లో కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఆసక్తి గలవారు స్వయం గ్రూపులుగా ఏర్పడితే వారికి కార్పొరేషన్ తరఫున పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యామ్‌సుందర్, డీఈఈ వెంకన్న, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో కమిషనర్ సరస్వతి, సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మున్సిపల్ కమిషనర్ వాణి

తుక్కుగూడ: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. ఒక మార్పు–అభివృద్ధికి మలుపు అనే నినాదంతో నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం 12వ రోజు మంఖాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణ పారిశుద్ధ్యంపై గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమం మున్సిపల్ వ్యాప్తంగా నిర్విరామంగా కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా నేడు ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, తడి, పొడి చెత్త వేరుచేయుట, చెత్తను మున్సిపాలిటీ వాహనాలకు అప్పగించడం తదితర అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లేశ్, ఆర్ఓ మల్లేశ్, సిబ్బంది శ్రీహరి, ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వాణి, అధికారులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తూర్‌లో తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, అందులో భాగంగానే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నాయకులు ఎస్.పాండు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ప్రొసీడింగ్ అందిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, అధికారులు

సమస్యల పరిష్కారానికి కృషి



ఆయిల్‌మిల్ వద్ద అధికారులతో చర్చిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవపాటిల్

ఎల్బీనగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ అన్నారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యతో కలిసి మన్సూరాబాద్ డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ డివిజన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. జడ్జెస్‌కాలనీ ఫేజ్–1లోని హిందూ శ్మశానవాటికను మోడల్ శ్మశానవాటికగా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కేబీఆర్ కన్వెన్షన్, కాస్మోపాలిటన్ కాలనీల నంచి వచ్చే వరదతో వీకర్‌సెక్షన్ కాలనీ ముంపునకు గురవుతుందని, త్వరలోనే వరదకాలువ పనులు చేపడుతామని పేర్కొన్నారు. మన్సూరాబాద్ సహారా రోడ్డు ఆయిల్‌మిల్ వద్ద ఓపెన్ నాలాను ఆధునీకరించి, వరద రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ రమేశ్‌బాబు, డీఈ కనకయ్య, ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, శానిటేషన్ డీఈ నీలిమా పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

లింగోజిగూడ: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఉప్పల శ్రీనివాస్ గుప్తాను పలువురు కాంగ్రెస్ నాయకులు నాగోల్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బండ్లగూడ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణగౌడ్, నాయకులు నరేశ్‌కుమార్, వెంకటేశ్, రవీందర్, మెట్టు విజయ్, సాయిచరణ్, నరేందర్, సాయిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ట్రంక్‌లైన్ సమస్య తీర్చాలని వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని రామిడి మల్లారెడ్డి కాలనీలో నెలకొన్న ట్రంక్‌లైన్ సమస్య తీర్చాలని శుక్రవారం కమిషనర్ పి.సరస్వతికి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీల మీదుగా ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషమన్నారు. కానీ వరదనీరు వెళ్లేందుకు వేసిన ట్రంక్‌లైన్‌లోకి మురుగునీరు లైన్లు కలపడంతో దుర్వాసన వస్తోందన్నారు. వీటితో పాటు ట్రంక్‌లైన్‌లలో అక్కడక్కడ మట్టి రాళ్లు పేరుకుపోవడంతో మురుగునీరు (డ్రైనేజీ వాటర్) చేరి దుర్వాసనతో పాటు దోమలు, పేరుకుపోయి ఇళ్లల్లో ఉండలేకపోతున్నామన్నారు. ట్రంక్‌లైన్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, వ్యర్థాలను, రాళ్లను, మట్టిని తొలగించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని కోరారు. అలాగే మదురాపురి కాలనీనుంచి మల్లారెడ్డినగర్ కాలనీ రోడ్ నంబర్–4 వరకు వేరుగా ప్రత్యేక డ్రైనేజీ లేనందున ఈ సమస్య మరింత ఎక్కువవుతుందన్నారు. కొత్త డ్రైనేజీ లైన్ వేస్తే ఈ సమస్య తీరుతుందన్నారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి, ఎస్‌జీఆర్ కాలనీ అధ్యక్షులు జైహింద్, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, రామిడి రాజిరెడ్డి, లింగారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు